
హైదరాబాద్ వార్త



# కేంద్ర ప్రభుత్వ విధానాలే అధిక ధరలకు కారణం

### -సిపిఐ నేత వి.ఎస్.బోస్

**సైఫాబాద్, సెప్టెంబరు 3 ప్రభాతవార్త:** దేశంలో నిత్యావసర వస్తువులతో పాటు, అన్నిరకాల వస్తువుల ధరలు ప్రజలకు అందుబాటులో లేకుండా పోవడానికి కేంద్ర ప్రభుత్వ విధానాలే కారణమని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు వి.ఎస్.బోస్ ఆరోపించారు. ఆహార ధాన్యాలు, కూరగాయాలు పండించే రైతులకు కష్టాలు, బడా వ్యాపారులకు లాభాలు తెచ్చే విధానాన్ని కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్నదని, రైతు కోరుకున్న గిట్టుబాటు ధరలపై ఏలాంటి స్పందన లేని కేంద్ర ప్రభుత్వం ఈ రంగంలో దోపిడీదారులైన పెట్టుబడిదారులకు బార్లా తలుపులు తెరిచిందని ఆయన మండిపడ్డారు. ప్రపంచంలో చమురు ధరలు తగ్గినా మన దేశంలో పెట్రోల్, డిజీల్ ధరలు తగ్గకపోవడంతో రవాణా ఖర్చుల ధరలు పెరగడం ఒక కారణమైతే లాభాలే ప్రధానంగా చూసే కార్పోరేట్ సంస్థలకు రిటైల్ వ్యాపారంలో అనుమతించడం మరో ముఖ్యమైన కారణమని విమర్శించారు. ప్రపంచంలో క్రూడ్ అయిల్ ధరలు తగ్గినా రష్యా నుంచి క్రూడ్రా అయిల్ కారు చౌకగా మన దేశానికి వచ్చినా ప్రధాని నరేంద్రమోదీ ఆధానీ యేడల ఆశింత పక్షపాతంగా వ్యవహరించడం మూలంగా డిజీల్ ధరలు తగ్గకపోవడంతో రవాణా ఖర్చులు పెరిగాయన్నారు. దేశంలో జిడిపి పెరిగిందని, తలసరి ఆదాయం పెరిగిందని, తప్పుడు ప్రచారం చేస్తున్న మోదీ ప్రభుత్వం ప్రజల అవసరాలను, కష్టాలను అర్థం చేసుకునే ఆలోచన లేకపోవడం ధరలు పెరుగుదలకు కారణమన్నారు. ప్రభుత్వ పాలన ప్రజల కోసమేనన్న నీతిని మరిచిపోయి మోదీ ప్రభుత్వం కార్పోరేట్ల భజన చేయడం కూడా ప్రదాన కారణమని, వ్యాపారంగంలో పోటీతత్వం పెరిగితేవస్తువుల ధరలు తగ్గుతాయని నమ్మించి విదేశీ పెట్టుబడులను స్వదేశీ కార్పోరేట్ సంస్థలను రిటైల్ రంగంలోకి అనుమతించడంలో కేంద్రం విజయం సాధించిందని, కాని వాస్తవంలో వస్తువు ధర తగ్గకపోవడంతో కేంద్ర ప్రభుత్వ మోసపూరిత ప్రచారాన్ని ప్రజలు గుర్తిస్తున్నారని ఆయన అన్నారు.

# వరద ముంపు నివారణకు చర్యలు

### -జిహెచ్ఎంసి కమిషనర్ ఆమ్రపాలి కాట



చెరువుల మ్యాప్‌ను పరిశీలిస్తున్న ఆమ్రపాలి

**మూసాపేట్, సెప్టెంబర్ 3, ప్రభాతవార్త**

వరద ముంపు నివారణకు నాలా పనులను చేపట్టేందుకు చర్యలు తీసుకోవాలని జిహెచ్ఎంసి కమీషనర్ ఆమ్రపాలి జోనల్ కమీషనర్లకు ఆదేశించారు. మంగళవారం కూకట్‌పల్లి జోన్‌లో జిహెచ్ఎంసి కమీషనర్ పలు ప్రాంతాల్లో ఆకస్మికంగా పర్యటించి వరద ముంపు ప్రాంతాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మైసమ్మ చెరువు, ఐడిఎల్ చెరువు, సఫ్దర్ నగర్‌లో వరద ముంపు ప్రాంతాలను పరిశీలించారు. సఫ్దర్ నగర్‌లో వరద ముంపు ప్రాంతాలను పరిశీలించారు. సఫ్దర్ నగర్‌లో వరద ముంపుకు గురైన ప్రాంతాన్ని పర్యటించి ఆమె ప్రజలతో మాట్లాడారు. ఇకముందు వరద ముంపుకు గురి కాకుండా నాలా పనులు చేపట్టేందుకు చర్యలు తీసుకోవాలని జోనల్ కమీషనర్‌ను ఆదేశించారు. ముంపుకు గురైన కాలనీ వాసులకు సురక్షిత త్రాగునీరు సరఫరా చేయాలని, దోమల నివారణకు ఏఎల్ఓ, ఫాగింగ్ చర్యలు చేపట్టాలని సూచించారు. వ్యాధులు ప్రభలకుండా అవసరమైన చోట హెల్త్ క్యాంపులు ఏర్పాటు చేయాలన్నారు. అన్ని వేళలా ప్రజలకు అందుబాటులో ఉండాలని అధికారులకు సూచించారు. ఐడిఎల్, మైసమ్మ చెరువుల వద్ద గణేష్ నిమజ్జనంకు ఏర్పాట్లు పూర్తి చేయాలన్నారు. నిమజ్జనం జరిగే ప్రాంతాల్లో ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని, అన్ని సౌకర్యాలు ఏర్పాటు చేయాలని సంబంధిత అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో కూకట్‌పల్లి జోనల్ కమీషనర్ అపూర్వ్ చౌహాన్, ఎస్ఈ చిన్నరెడ్డి, డిసిలు ఆయా శాఖల అధికారులు పాల్గొన్నారు.

# గణేష్ నిమజ్జనానికి చెరువులను సిద్ధం చేయాలి

### -నగర మేయర్ గద్వాల విజయలక్ష్మి



సఫిల్‌గూడ చెరువులోని పనులను పరిశీలిస్తున్న నగర మేయర్ గద్వాల విజయలక్ష్మి..

**నేరెడ్‌మెట్, సెప్టెంబర్03 ప్రభాతవార్త:** గణనాథుల నిమజ్జనానికి సఫిల్ చెరువును సిద్ధం చేయాలని నగర మేయర్ గద్వాల విజయలక్ష్మి పేర్కొన్నారు. మంగళవారం జోనల్ కమీషనర్ రవితో కలసి మల్కాజిగిరి మున్సిపల్ పరిధిలోని సఫిల్‌గూడ మినీ ట్యాంక్‌బండ్‌ను ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సెప్టెంబర్ 7వ తేదీ నుండి 17వ తేదీ వరకు గణపతి నవరాత్రి ఉత్సవాలు నిర్వహించడం జరుగుతుందన్నారు. గణనాథుల నిమజ్జనానికి శానిటేషన్, రోడ్లు, పారిశుద్ధ్యం, ట్రాఫిక్ తదితర సమస్యలపై ప్రత్యేక దృష్టి సారించి ఎటువంటి ఇబ్బందులు కలగకుండా చూడాలన్నారు. డార్క్ స్పాట్స్ వద్ద ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా విద్యుత్ దీపాలు, పోలీసు బందోబస్తు ఏర్పాటు చేయాలన్నారు. వినాయక నిమజ్జనానికి ర్యాలీగా వచ్చే ప్రధాన రహదారులు గుంతలు గుంతలుగా ఉండకుండా చూడాలన్నారు. అంతేకాకుండా చెట్టు కొమ్మలను వినాయకులను తగలకుండా తొలగించాలన్నారు. చెరువు వద్ద బోట్‌ను సిద్ధంగా ఉంచాలన్నారు. నిమజ్జనానికి వచ్చే భక్తులకు మంచినీరు, టాయిలెట్స్ కనీస వసతులు కల్పించాలన్నారు. సర్కిల్ పరిధిలో 24గంటలు పనిచేసేలా కంట్రోల్ రూమ్‌ను ఏర్పాటు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ డీసి రాజు, కార్పొరేటర్ శ్రావణ్, పోలీస్, శానిటేషన్, లేక్స్, ఎంటమాలజీ, వైద్య ఆరోగ్య శాఖ, ఇంజనీరింగ్ ఇతర విభాగాల అధికారులు పాల్గొన్నారు.

# జంగంవాని కుంట జాడేదీ..?

## గొలుసుకట్టు చెరువుల గోస-3



**సైబరాబాద్ ప్రతినిధి, సెప్టెంబరు 3 ప్రభాతవార్త**

**అది హైటెక్ మండల కార్యాలయానికి ఎదురుగా కూతవేటు దూరం లోనే ఉండే కుంట.. పైగా వంద అడుగుల రహదారిని ఆనుకొని ప్రతినిత్యం లక్షలాది జనసంచారం మధ్య ఉండే జలవనరు.. దాన్ని సైతం వదల్లేదు ఘనతవహించిన హైటెక్ కబ్జారాయుళ్లు.. అర్ధరాత్రి వేళల్లో అడ్డగోలుగా మట్టిని పూడ్చి ఆనవాళ్లు లేకుండా చేశారు.. ఈవిషయాన్ని ప్రప్రథమంగా ప్రభాతవార్త వెలుగులోకి తేగా అప్పటి రెవెన్యూ అధికారులు మట్టిని తొలగించే నెపంతో జేబులు నింపుకు న్నారు.. ఇరిగేషన్ అధికారులు సైతం కబ్జారాయుళ్ల ఇష్టానికి వదిలేశారు.. పదేళ్ల క్రితం కబ్జాకు గురైన జలవనరుల జాడ తీస్తామంటూ ప్రైవేటు సంస్థకు కాంట్రాక్టుకిచ్చి కనీసం కాగితాల్లో కూడా లేకుండా చేశారు హెచ్ఎండిఎ అధికారులు.. ఇంకేముంది హైటెక్‌సిటీ చెంత కోట్లాదిరూపాయల విలువైన జంగంవానికుంట భూమి జాడాపత్తా లేకుండా పోయింది.**

శేరిలింగంపల్లి మండలం కొండాపూర్ గ్రామ సర్వేనెంబరు 134లో జంగంవాని కుంట 2.35ఎకరాల విస్తీర్ణంలో ఉండేది. నిజాంకాలం నుంచి ఈ కుంట రికార్డులు భద్రంగా ఉండగా గత పదేళ్ల క్రితం వరకు ఈకుంట నీటితో కళకళలాడేది. హైటెక్‌సిటీకి అతి చేరువలో దాదాపు మూడు ఎకరాల మేర విస్తరించివున్న ఈకుంటపై కన్నుపడడంతో ఎలాగైనా కాజేయాలని పథకరచన చేసిన కబ్జారాయుళ్లు రాత్రివేళల్లో వందలాది టిప్పర్ల మట్టిని కుంటలో డంప్‌చేసి కుంటను పూర్తిగా పూడ్చివేశారు. ఈవిషయమై అప్పట్లో వార్త దినపత్రిక ప్రధాన శీర్శికన కథనం వెలువరించగా మట్టిని తొలగిస్తున్నట్లు హడావుడి చేసిన రెవెన్యూ అధికారులు ఆతర్వాత మాయమయ్యారు. చెరువు కుంటల పరిరక్షణకోసమే ఉన్న ఇరిగేషన్ శాఖ అధికారులు సైతం కబ్జాదారుల ధనబలానికి దాసోహమన్నారు. 2014వ సంవత్సరం లో జిహెచ్ఎంసి పరిధిలోని అన్ని చెరువుల లెక్కతేలుస్తామని ముం దుకు వచ్చిన హెచ్ఎండిఎ అధికారులు అసలు రికార్డుల్లో కూడా కుంట ఆనవాళ్లు లేకుండా చేశారు.

### పదంతస్తుల భవనాల పునాదులెక్కడ..?

పదేళ్ల క్రితం కబ్జాదారులు జంగంవాని కుంటను పూర్తిగా పూడ్చివేయగా దానిచుట్టూ అడ్డగోలుగా నిర్మాణాలు పుట్టుకొచ్చాయి. ప్రస్తుతం కుంట ఆనవాళ్లు ఏమి కనిపించకపోయినా మిగిలివున్న ఖాళీ స్థలంలో సైతం అడపాదడపా నిర్మాణాలు పుట్టుకొస్తున్నాయి. ఇదే ప్రాంతంలో ఇటీవల పదంతస్తుల ఆకాశహర్మ్యాలు కూడా వెలియగా ఈనిర్మాణాలు కుంట ఎఫ్‌టిఎల్‌లో ఉన్నాయా లేక ఆవలా ఉన్నాయా అనుమానాస్పదంగా మారింది. అసలు కుంటకు ఎఫ్‌టిఎల్ మ్యాప్‌తోపాటు కుంట ఉనికి కూడా లేకుండా ఇరిగేషన్ అధికారులు ఏ ఆధారాలతో ఎన్ఓసిలు ఇచ్చారో భవన నిర్మాణ అనుమతులు ఎలా వచ్చాయో బహిర్గతం కావాల్సి వుంది. ప్రస్తుతం ముఖ్యమంత్రి నేతృత్వంలో హైడ్రా చెరువుకుంటల పరిరక్షణకు చిత్తశుద్ధితో పనిచేస్తున్న నేపథ్యంలో ఇప్పటికైనా జంగంవానికుంటకు మోక్షం కలుగుతుందని స్థానికులు ఆశాభావం వ్యక్తంచేస్తున్నారు.

### ఖాస్ర పహనీ నుంచే కుంట : శేరిలింగంపల్లి ఎమ్మార్వో వెంకారెడ్డి

కొండాపూర్ సర్వే నెంబరు 134లోని జంగంవాని కుంట ఖసర పహనీ నుంచి తమ రికార్డుల్లో ఉందని శేరిలింగంపల్లి ఎమ్మార్వో వెంకారెడ్డి ప్రభాతవార్తకు వివరణ ఇచ్చారు. గతంలోనే కుంటలో మట్టిని నింపడం వల్లనేమో ప్రస్తుతం అక్కడ నీరు కనిపించడం లేద న్నారు. కుంటలో నింపిన మట్టిని తొలగించి కుంటను పునరుద్దరిం చాలంటే ఇరిగేషన్ శాఖ సహకారం అవసరమన్నారు.

- అడ్రసు గల్లంతు చేసిన ఇరిగేషన్ అధికారులు
- రికార్డుల్లో కనబడకుండా చేసిన హెచ్ఎండిఎ
- పరాధీనమౌతున్నా పట్టించుకోని రెవెన్యూ విభాగం
- మట్టితో నింపి సమాధి చేసిన కబ్జారాయుళ్లు
- గుక్కెడు నీటికోసం అలమటిస్తున్న జలవనరు
- హైడ్రా అధికారులైనా గొంతు తడిపేనా..?



పదేళ్ల క్రితం జంగంవాని కుంట(ఉపగ్రహచిత్రం)



ఆతర్వాత భవనాలు పుట్టుకొచ్చిన వైనం

# వినాయక ..ఆగయా!

**-నవరాత్రి ఉత్సవాలకు విగ్రహాలు రెడీ**
**-నగరంలో ఊపందుకున్న కొనుగోళ్లు**
**-పివోపి విగ్రహాలతో పాటు మట్టివిగ్రహాలకు డిమాండ్**



**హైదరాబాద్, సెప్టెంబరు 3 ,ప్రభాతవార్త:** వినాయక నవరాత్రుత్సవాల నేపథ్యంలో నగరంలో గణపతి వవిగ్రహాల తయారీ కొనగోళ్లు ఊపందుకున్నాయి. ఈఏడాది వినాయక మండపాలు పెద్దసంఖ్యలో ఏర్పాటు చేసే అవకాశం ఉంది. ఈనెల7న వినాయకచవితి కాగా ఇప్పటికే గణపతి విగ్రహాల కొనుగోలు ప్రారంభించారు. దీంతో బస్తీలు, గల్లీలల్లో , గణేష్‌మండాపల ఏర్పాట్లలో నిమగ్నమైపోయారు. ఇప్పటికే మండపాల నిర్వాహకులు విగ్రహాలకు అడ్వాన్స్ ఇచ్చి రిజర్వ్ చేసుకోగా మరికొందరు తీసుకెళ్లేపనిలో పడ్డారు. గ్రేటర్ హైదరాబాద్‌లో లో దాదాపు 3లక్షల పెద్దవిగ్రహాలు తయారు చేస్తున్నారు. ధూల్‌పేట్ ,ఉప్పల్, నాగోల్, పెద్దఅంబర్‌పేట్ ,మియాపూర్, తదితర ప్రాంతాల్లో విగ్రహాల తయారీ ఖార్ఖానాలు దాదాపు 500వరకు ఉంటాయి. అమ్మకాలతో ప్రత్యక్షంగా పరోక్షంగా లక్షలమంది ఉపాధి పొందుతుంటారు. కరోనా కారణంగా రెండళ్ల విగ్రహాలు తయారీ దెబ్బతినగా ..ఆతర్వాత నుంచి పుంజుకుంది. పెద్దవిగ్రహాలకు స్థానికంగా చేస్తుండగా, చిన్నవి షోలాపూర్ నుంచి బల్క్‌గా తీసకువచ్చి హోల్‌సేల్‌లో అమ్మకాలు జరుపుతున్నారు. ఇతర రాష్ట్రాల వాళ్లు సైతం ఆర్డర్ చేసి కొనుగోలు చేస్తున్నట్లు దూల్‌పేట్ వ్యాపారులు తెలుపుతున్నారు.

**ఇంకా పివోపితోనే తయారీ ..**

పర్యావరణానికి హానికలిగించే ప్లాస్టర్ ఆఫ్ ప్యారీస్ (పివోపి)తో తయారు చేసే విగ్రహాలతో పోలిస్తే మట్టితో చేసినవవి మేలని నిపుణులు పేర్కొంటున్నారు. కొన్నేండ్లుగా మట్టిగణపతులపైనా జనాల్లో అవగాహన పెరిగింది. అయితే వీటితయారీలో ఇబ్బందులు ఉన్నాయని నిర్మాహకులు చెబుతున్నారు. ఎక్కవ కాలం నిల్వ ఉంచడం సాధ్యం కాదని ప్లాస్టర్ ఆఫ్ ప్యారీస్‌తో అయితే సులభంగా తయారు చేయొచ్చునని చెబుతున్నారు. అదేమట్టితో అయితే చేతులో నొక్కుతూ చేయాల్సి ఉంటుందని దీంతో మట్టివిగ్రహాల తయారీకి కార్మికులు ఇష్టపడటం లేదని పేర్కొంటున్నారు. ఎనిమిది ఫీట్ల పిఓపి విగ్రహ 20వేలు ఉంటే ..మట్టి విగ్రహం ధర 30వేల వరకు ఉంటుందని పేర్కొంటున్నారు. అలాగే ముడిసరుకుల ధరలు, కూలీల రేట్లు పెరగడటంతో విగ్రహాల రేట్లు పెంచక తప్పడం లేదని తయారీ దారులు పేర్కొంటున్నారు.

# పలు అభివృద్ధి పనులకు కౌన్సిల్ ఆమోదం

### -పాల్గొన్న ఎంపి ఈటల రాజేందర్



సమావేశంలో మాట్లాడుతున్న రాజేందర్

**కొంపల్లి, సెప్టెంబర్ 3, ప్రభాతవార్త**

కొంపల్లి పురపాలక సంఘ కార్యాలయంలో కౌన్సిల్ సాధారణ సమావేశంలో చైర్‌పర్సన్ సన్న శ్రీశైలం యాదవ్ అధ్యక్షతన నిర్వహించడమైంది. ఈ సమావేశంలో లోకసభ సభ్యులు మల్కాజిగిరి ఈటెల రాజేందర్ అన్ని వార్డుల యందు వివిధ రకాల అభివృద్ధి పనులు రోడ్డు, మురుగు నీటి కాలువలు, కల్వర్టు, వీధి దీపాలు, బిసి,ఎస్‌సి, కమ్యూనిటీ హాల్స్ నిర్మించుట, శ్మశానవాటికల అభివృద్ధి పనులు, పబ్లిక్ టాయిలెట్స్ ఏర్పాట్లు, వనమహోత్సవమునకు సంబంధించినటువంటి పనులకు గాను సుమారు 1923 లక్షల నిధులు కేటాయిస్తూ ఆమోదము తెలిపారు. అలాగే పార్కుల సంరక్షణ కొరకు హెచ్ఎండిఏ డిపార్ట్‌మెంట్ వారికి ఎలాంటి కట్టడాలకు అనుమతులు ఇవ్వకూడదని వారికి తెలియజేశారు. సబ్ రిజిస్ట్రేషన్ కార్యాలయం నుండి కొంపల్లి మున్సిపాలిటికి గత 5 సంవత్సరములుగా స్టాంప్ డ్యూటీ ఆదాయం రావడంలేదు. కొంపల్లి మున్సిపాలిటీకి రావాల్సిన స్టాంపన డ్యూటీ గురించి ప్రభుత్వము వారిని కోరుటకు చర్చించడం జరిగింది. కొంపల్లి మున్సిపాలిటీని జిహెచ్ఎంసిలో విలీనం చేయుటకు వస్తున్న వార్తలను అనుసరించి కొంపల్లి మున్సిపాలిటీ జిహెచ్ఎంసిలో విలీనానికి వ్యతిరేకంగా కౌన్సిల్ నిర్ణయాన్ని ప్రభుత్వానికి తెలుపుటకు కౌన్సిల్ ఏకగ్రీవ ఆమోదం తెలిపారు. గణేష్ నిమర్జనం కొరకు చెరువుల వద్ద భద్రత, సౌకర్యాలు ఇతరత్ర ఏర్పాట్లు గురించి చర్చించారు. తదుపరి కౌన్సిల్ సభ్యులు లేవనెత్తిన పలు అంశములపై చర్చించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమీషనర్ కె.శ్రీహరి, వైస్‌చైర్‌పర్సన్ రాత్లవాత్ గంగయ్య నాయక్, కౌన్సిల్ సభ్యులు, కో ఆప్షన్ సభ్యులు పాల్గొన్నారు.

# గొప్పవ్యక్తులను సమాజం మరిచిపోదు

### -హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ రాధారాణి



పురస్కారాలను ప్రదానం చేస్తున్న రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ రాధారాణి

**చిక్కడపల్లి, సెప్టెంబరు 3 ప్రభాతవార్త:** గొప్పవ్యక్తులను సమాజం ఎప్పటికి మరిచిపోదని రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ రాధారాణి అన్నారు. వివిధ రంగాలకు చెందిన వారిని గుర్తించి సత్కరించడం మంచి సంప్రదాయమన్నారు. మంగళవారం రాత్రి ప్రముఖ సాంస్కృతిక సేవా సంస్థ రాగసప్తస్వరమ్ నిర్వహణలో తిరుమల గ్రూప్, సీల్‌వెల్ కార్పొరేషన్ సౌజన్యంతో చిక్కడపల్లి శ్రీ త్యాగరాయ గానసభలో విఖ్యాత నటుడు అక్కినేని నాగేశ్వరరావు శత జయంతి వేడుకలు ఘనంగా నిర్వాహకురాలు విఎస్.రాజ్యలక్ష్మి ఆధ్వర్యంలో జరిగింది. ముఖ్యఅతిథిగా రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ రాధారాణి హాజరవగా కార్యక్ర మానికి తిరుమల గ్రూప్ చైర్మన్ నంగునూరి చంద్రశేఖర్ అధ్యక్షత వహించారు. క్రమశిక్షణ, ఎంచుకున్న రంగంలో ఎవరెస్ట్ శిఖరానికి ఎదిగిన మహోన్నత వ్యక్తి అక్కినేని నాగేశ్వరరావు అని, భక్తిరస ప్రాధాన్యత చిత్రాల్లో నటించి అందరి నుంచి ప్రశంసలు అందుకున్నారన్నారు. ఎలక్ట్రానిక్ సామాజిక మాధ్యమ జర్నలిస్టులకు రాగసప్తస్వరమ్ సంస్థతో ప్రారంభం నుంచి అనుబంధం ఉన్న ప్రింట్ మీడియా పాత్రికేయులు ఆర్.వి. రమణ,న్యాయపతి రమేశ్‌బాబు, బాలకృష్ణకు ప్రింట్ మీడియా పురస్కారాలను ప్రభు, సురేశ్ కొండేటి, జి.అంజిబాబు, హేమలతలకు అందించారు. అదే విధంగా ప్రముఖ సాంస్కృతిక సంస్థల వ్యవస్థాపకులు డాక్టర్ ఎం.కె.రాము(రసమయి), మద్దాళి రఘురా మ్(కిన్నెర), గుదిబండి వెంకటరెడ్డి(జివిఆర్ ఫౌండేషన్), డాక్టర్ ఇ.భవానీ(అభినందన), సంజయ్‌కిషోర్(సంగం వ్యవస్థాపకులు), లంక లక్ష్మినారాయణ(యువకళావాహిని)లకు చెందిన ప్రముఖులకు పురస్కారాలు ప్రదానం చేశారు. రాగసప్తస్వరమ్ ఆత్మీయ పుర స్కారాలను వై.సుబ్రహ్మణ్యశర్మ, ఎం.సురేంద్ర, డాక్టర్ జె.చెన్నయ్య, ఎంకెఆర్. ఆశాలత, డాక్టర్ జ్యోత్స్నరావు, ఆచార్య డాక్టర్ శరత్‌జ్యోత్స్నారాణిలకు అందించగా వీరితో పాటు గాయనీ గాయకులు బాలకామేశ్వ రరావు, 'నవరసగాయని' ఆమని, డాక్టర్ చింతలపూడి త్రినాథరావు, వైఎస్.రామకృష్ణ,నందూరి వెంకటేశ్వరరావులకు అందిం చారు. ఈ కార్యక్రమానికి తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకురాలు నన్నపనేని రాజకుమారి సభను ప్రారంభించగా కార్యక్రమంలో వంశీ సంస్థల అధినేత డాక్టర్ వంశీ రామరాజు, కాంగ్రెస్ నాయకురాలు శ్రీమణి,అతిథులుగా పాల్గొన్నారు. అక్కినేని సినిమాలలోని పాటలను బాలకామేశ్వరరావు, ఆమని బృందం ఆలపిస్తారు.

# మనల్ని ఎవరు ఆపేది...

-అడ్డగోలుగా అనుమతుల్లేని భారీ షెడ్ల నిర్మాణాలు
-ఫిర్యాదు చేసిన చర్యలు చేపట్టని అధికారగణం
-టాస్క్‌ఫోర్స్, విజిలెన్స్ విభాగాలు కార్యాలయాలకే పరిమితమా..?
-దారిమళ్ళుతున్న లక్షలాది రూపాయల ప్రభుత్వ ఆదాయం..
-పరిశీలించి చర్యలు చేపడతాం : కమిషనర్ సత్యనారాయణరావు


బహాదూర్‌పల్లి ఎస్‌టూా పరిశ్రమ పక్కన అనుమతుల్లేని భారీషెడ్డు


దొమ్మరపోచంపల్లికి వేళ్ళే దారిలో వెలసిన షెడ్డు

**దుండిగల్, సెప్టెంబర్ 3 ప్రభాతవార్త:** నిర్మాణాల విషయంలో ప్రభుత్వ నిబంధనలు రాష్ట్రంలోని అన్ని మున్సిపాలిటీల్లో ఒకేలా ఉంటాయి. అయితే ఇందుకు భిన్నంగా దుండిగల్ మున్సిపాలిటీలో ప్రత్యేక నిబంధనలు, చట్టాలు నడుస్తున్నాయి. నిర్మాణాలు చేపట్టాలంటే పలుకుబడి ఉంటే చాలు ప్రభుత్వ నిబంధనలతో పని లేదు. మాకు పలుకుబడి ఉంది ఇక అనుమతులు, నిబంధనలతో మాకేం పని ' మనల్ని ఎవరు ఆపేది' అంటూ నిర్మాణదారుడు తనకు నచ్చినట్లు నిర్మాణాలను కొనసాగిస్తున్నారు. ఉన్నతాధికారుల పర్యవేక్షణ లోపం, స్థానిక అధికార యంత్రాంగం భాధ్యతారాహిత్యమో, సహకారమో గాని అనుమతుల్లేని భారీ షెడ్లు పదుల సంఖ్యలో నిర్మాణాలు జరుగుతున్నాయి. సదరు అక్రమ షెడ్లపై చర్యలు చేపట్టాలని స్థానికుల నుండి అందిన ఫిర్యాదులు చెత్తబుట్టలోకే వెళ్తున్నాయి. పలుమార్లు ప్రశ్నించిన అధికారగణం పొంతన లేని సమాధానాలు చెబుతూ దాటి వేస్తున్నారే గాని చర్యలు చేపట్టేందుకు వెనుకడుగు వేయడంతో పలు అనుమానాలు ఉత్పన్నమవుతున్నాయి. కాగా ఫిర్యాదు చేసిన రోజు నుండి కాలయాపన చేస్తూ నిర్మాణం పూర్తి అయిన తరువాత నిర్మాణం ఎప్పుడో అయిపోంది ఇప్పుడు దాని గురించి ఎందుకు వదిలేయండి అని ఉచిత సలహాలు ఇవ్వడంలో దుండిగల్ మున్సిపల్ అధికారులు రాష్ట్రంలోనే అగ్రస్థానంలో ఉన్నారు అనడంలో ఎటువంటి సందేహం లేదు. స్థానిక యంత్రాంగం నిర్లక్ష్య వైఖరికి తోడు విజిలెన్స్, టాస్క్‌ఫోర్స్, హెచ్‌ఎండిఏ ఎన్‌ఫోర్స్‌మెంట్ విభాగాలు సైతం దృష్టిసారించక పోవడంతో లక్షలాది రూపాయల ప్రభుత్వ ఆదాయాన్ని కొల్లగొడుతున్నారు. దుండిగల్ మున్సిపాలిటీ పరిధిలో గత కొంతకాలంగా అనుమతుల్లేని భారీ షెడ్ల నిర్మాణాలు జోరుగా కొనసాగుతున్నాయి. బహాదూర్‌పల్లి పరిధి టెక్‌మహీంద్రా సమీపంలో, ఎస్‌టూా పరిశ్రమ పక్కన, గండిమైసమ్మ టూ మేడ్చల్ రోడ్డులో గల లెజెండ్ వెంచర్‌లో రెండు, శివజ్యోతి కాలనీలో ఒకటి, ఎమ్మెల్లార్ కమాన్ ఎదురుగా రెండు, దొమ్మరపోచంపల్లి గ్రామానికి వెళ్ళే మార్గంలో రెండు, గండిమైసమ్మ చౌరస్తా నుండి రింగురోడ్డు వరకు ప్రధాన రహదారికి ఇరువైపుల, పరిసర ప్రాంతాల్లో 300 గజాల నుండి 1000 గజాలకు పైగా విస్తీర్ణంలో అనుమతుల్లేని షెడ్ల నిర్మాణాలు పదుల సంఖ్యలో చోటు చేసుకున్నాయి. షెడ్ల నిర్మాణం చేపట్టాలంటే హెచ్‌ఎండిఏ అనుమతులు తప్పనిసరి. మ్యాన్‌ఫ్యాక్చర్, ఇండస్ట్రీయల్, కమర్షియల్ జోన్లలో చేపట్టాల్సిన షెడ్లను రెసిడెన్షియల్ జోన్లలో నిర్మిస్తున్నారు. మున్సిపాలిటీకి అనుమతులు ఇచ్చే అధికారం లేకున్నా అక్రమ నిర్మాణాలు అడ్డుకోవాల్సిన భాధ్యత వారిదే. అక్రమ షెడ్లపై హెచ్‌ఎండిఏ ఏమాత్రం పట్టించుకోక పోగా ఇటు మున్సిపాలిటీ అధికారులు సైతం పట్టనట్లు వ్యవహరిస్తూ అక్రమ నిర్మాణదారులకు పరోక్షంగా సహకరిస్తున్నారు. దీంతోనే మనల్ని ఎవరు ఆపేదంటూ ఇష్టారాజ్యాంగా షెడ్లు నిర్మిస్తున్నారు. కాగా ఇటీవల వెలుగులోకి వచ్చిన అధికార పార్టీకి చెందిన ఓ యువనేత పలు షెడ్లు జోలికి వెళ్ళదంటూ అధికారులకు హుకుం జారీ చేసినట్లు సమాచారం.

**విజిలెన్స్, టాస్క్‌ఫోర్స్, హెచ్‌ఎండిఏ ఎన్‌ఫోర్స్‌మెంట్ కార్యాలయాలకే పరిమితమా...?**

అక్రమ నిర్మాణాలపై ప్రత్యేక నిఘా, దృష్టి సారించాల్సిన విజిలెన్స్, టాస్క్‌ఫోర్స్, హెచ్‌ఎండిఏ ఎన్‌ఫోర్స్‌మెంట్ విభాగాలు సైతం కార్యాలయాలకే పరిమితమైనట్లు ఆరోపణలు ఉన్నాయి. అయితే అయా విభాగాలు సైతం సహకరించడంతోనే స్థానిక అధికార యంత్రాంగం పట్టనట్లు వ్యహరిస్తున్నారని, దీంతో అక్రమ నిర్మాణదారులు తమ మొక్కులు చెల్లించుకొని అనుమతుల్లేని షెడ్ల నిర్మాణాలు ఎటువంటి ఆటంకం లేకుండా కొనసాగిస్తున్నట్లు తెలుస్తుంది. ఇప్పటికైన ఉన్నతాధికారులు, విజిలెన్స్, టాస్క్‌ఫోర్స్ విభాగాలు స్పందించి అక్రమ షెడ్లపై చర్యలు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.

**పరిశీలించి చర్యలు తీసుకుంటాం : కమిషనర్ సత్యనారాయణరావు**

కొంతకాలం అనుమతుల్లేకుండా వెలుస్తున్న అక్రమ షెడ్లపై మున్సిపల్ కమీషనర్ సత్యనారాయణరావును వివరణ కోరగా ఈవిధంగా స్పందించారు. ఆయా ప్రాంతాల్లో జరుగుతున్న నిర్మాణాలను మాసిబ్బంది పరిశీలిస్తారు. అనుమతుల్లేకుండా నిర్మాణాలు జరిగినట్లు నిర్ధారణ అయితే వెంటనే చర్యలు చేపడుతాము. అక్రమ నిర్మాణాలను ఎట్టి పరిస్థితుల్లో ఉపేక్షించేది లేదన్నారు.

## ఎస్సీల హక్కుల పరిరక్షణలో ముత్తన్నది ప్రముఖ పాత్ర :రాజు ఉస్తాద్


ముత్తన్న చిత్రపటానికి నివాళులు అర్పిస్తున్న రాజు ఉస్తాద్

**సైఫాబాద్, సెప్టెంబరు 3 ప్రభాతవార్త:** షెడ్యూల్డ్ కులాల హక్కుల పరిరక్షణ సంఘం జాతీయ గౌరవ అధ్యక్షుడు మేకల ముత్తన్న మృతి చెందడంపట్ల సంఘం జాతీయ కమిటి ప్రగాఢ సంతాపం వ్యక్తం చేసింది. ఈ మేరకు మంగళవారం ట్యాంక్‌బండ్ వద్దగల డా.బి.ఆర్.అంబేద్కర్ విగ్రహం వద్ద జాతీయ కమిటి అధ్యక్షుడు రాజు ఉస్తాద్ తోపాటు ఉపాధ్యక్షుడు పి.జగన్నాథం తదితరులు పూల మాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. గత నెల 23వ తేదీన ముత్తన్న మృతి చెందడం జరిగిందని, ఆయన సంఘానికి విశేషమైన సేవలు అందించారని, ఆయన ఇచ్చిన స్ఫూర్తితోనే సంఘంలో కొనసాగుతుందని రాజు ఉస్తాద్ చెప్పారు. ఎస్సీల హక్కుల పరిరక్షణలో ముత్తన్న ప్రముఖ పాత్ర పోషించారని కొనియాడారు.

## కొబ్బరిచెట్టు ప్రాభవాన్ని కళ్లకుకట్టిన కల్పవృక్షం లఘుచిత్రం

-ప్రముఖ సినీనటుడు, దర్శకుడు, రచయిత తనికెళ్ళ భరణి


కల్పవృక్షం నిర్మాత దర్శకులను సత్కరిస్తున్న తనికెళ్ళభరణి, ఓలేటి, రఘురామ్ తదితర అతిథులు

**రవీంద్రభారతి, సెప్టెంబరు 3 ప్రభాతవార్త :** ప్రపంచ కొబ్బరి దినోత్సవాన్ని పురస్కరించుకొని రవీంద్రభారతిలోని సమావేశ మందిరంలో డా. నిట్టల గోపాలకృష్ణ (లక్ష్మణరేఖ) స్క్రిప్ట్, దర్శకత్వం; సాలూరి వాసురావు సంగీతం దర్శకత్వం; జె.రాధాకృష్ణ నిర్మాతగా గోపాలకృష్ణ-రాధాకృష్ణ ప్రొడక్షన్స్ నిర్మించిన ప్రదర్శించిన కల్పవృక్షం లఘుచిత్రం కొబ్బరిచెట్టు ప్రాముఖ్యత, ప్రాభవాన్ని కళ్ళకుకట్టిందన్న ప్రముఖ సినీనటుడు, దర్శకుడు, రచయిత తనికెళ్ళభరణి, ప్రపంచ కొబ్బరి దినోత్సవం రోజు ఆసక్తికర విజ్ఞానదాయకమైన విషయాలను తెలిపిన చిత్ర నిర్మాణవర్గానికి అభినందనలు తెలిపారు. డా. ఓలేటి పార్వతీశం సభాధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన తనికెళ్ళభరణి విశిష్ట అతిథులు రేలంగి నరసింహారావు, ఎస్వీ రామారావు, సంస్థ కార్యదర్శి మద్దాళి రఘురామ్ తదితరులతో కలిసి లఘుచిత్ర నిర్మాత రాధాకృష్ణ, దర్శకుడు గోపాలకృష్ణ, సంగీత దర్శకుడు సాలూరి వాసురావులకు ఘనంగా అభినందన సత్కారం కావించారు. ఓలేటి అధ్యక్షోపన్యాసంలో కల్పవృక్షంను దర్శక నిర్మాతలు సామాజిక అంశంతో తీశారని, తప్పకుండా ఉత్తమ లఘుచిత్రంగా గుర్తింపు పొందుతుందన్న ఆశాభాన్ని వ్యక్తపరిచారు. రఘురామ్ సభకు స్వాగతం పలుకగా ఎస్వీరామారావు అభినందనలు తెలిపార్డ్డి

## జిహెచ్‌ఎంసి యంత్రాంగం అప్రమత్తగా ఉండాలి : డిప్యూటీ మేయర్


జీహెచ్‌ఎంసీ అధికారులతో మాట్లాడుతున్న డిప్యూటీ మేయర్ శ్రీలత శోభన్‌రెడ్డి

**తార్నాక, సెప్టెంబర్ 3 ప్రభాతవార్త:** వర్షాల నేపథ్యంలో జీహెచ్‌ఎంసీ యంత్రాంగం అప్రమత్తగా ఉండాలని నగర డిప్యూటీ మేయర్ శ్రీలత శోభన్‌రెడ్డి అధికారులకు సూచించారు. మంగళవారం తార్నాకలోని క్యాంపు కార్యాలయంలో జీహెచ్‌ఎంసీ అధికారులతో అత్యవసర సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా డిప్యూటీ మేయర్ మాట్లాడుతూ డివిజన్‌లో జరుగుతున్న అభివృద్ధి పనులను త్వరితగతిన పూర్తి చేయాలని, రోడ్లపై ఎలాంటి తవ్వకాలు చేపట్టకూడదన్నారు. అదేవిదంగా సీజినల్ వ్యాదులను దృష్టిలో ఉంచుకొని ఎంటమాలజీ విభాగం వారు స్ప్రేయింగ్ చేయాలని ఆదేశించారు. ఇండ్ల నుంచి సేకరించిన చెత్తను వెంటనే తరలించాలని, విధ్యుత్ దీపాలు చెత్తను కప్పివేయకుండా సాయంత్రం వేళలో వెలుగులు ఉండేలా చూడాలని విజ్ఞప్తి చేశారు. శిథిలావస్థలో ఉన్న ఇండ్లను గుర్తించి ప్రజలను సురక్షిత ప్రాంతాలకు పంపించాని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో శానిటేషన్ డిఈ.వెంకటేష్, డిఈ సువర్ణ, ఏఈ వేను,ఎన్టమాలజీ రాజశేఖర్,ఎస్ఎఫ్ఏలు పాల్గొన్నారు.

## నిండా మునిగిన ఎస్ఆర్ కాలేజ్

-కళాశాల భవనం సీజ్..
-వర్షాలతోనే సెలవులు పక్రటించినట్లుగా విద్యార్థులతో యాజమాన్యం

**నిజాంపేట్, సెప్టెంబర్ 3, ప్రభాతవార్త**

నిజాంపేట్ బాచుపల్లి రహదారిలోని మేటాస్ హిల్‌కౌంటీ ఎదురుగా గల ఎస్ఆర్ రెసిడెన్షియల్ జూనియర్ కళాశాల భవనాన్ని వరద ముంచెత్తింది. కాలేజ్ సెల్లార్‌లోకి భారీగా నీరు చేరడంతో విద్యార్థులు బయటకు రాలేని పరిస్థితులు ఏర్పడ్డాయి. ఇక్కడి పరిస్థితిని గమనించిన అధికారఉలు మాత్రం ఈ కళాశాల భవనం పక్కనే ఉన్న పత్తికుంట చెరువు ఎఫ్‌టీఎల్‌లో నిర్మించారంటూ భవనాన్ని సీజ్ చేశారు. కాలేజీ యాజమాన్యం మాత్రం ఈ విషయాలు బయటకు పొక్కకుండా భారీ వర్షాల నేపథ్యంలో సోమవారం వరకు సెలవులు ప్రకటించి విద్యార్థులను ఇళ్లకు పంపించివేసింది.

## రాజకీయాలకు అతీతంగా అభివృద్ధి పనులు

-ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్


శాంతినగర్‌లో ఫైప్‌లైన్ పనులను ప్రారంభిస్తున్న అంబర్‌పేట ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్, చిత్రంలో గోల్నాక కార్పొరేటర్ దూసరి లావణ్య శ్రీనివాస్‌గౌడ్

**హైదరాబాద్, సెప్టెంబరు 3 ప్రభాతవార్త**

అంబర్‌పేట నియోజకవర్గంలో రాజకీయాలకు అతీతంగా అభివృద్ధి పనులను చేపడుతున్నట్లు ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ అన్నారు.మంగళవారం గోల్నాక డివిజన్ శాంతినగర్‌లో స్థానిక కార్పొరేటర్ దూసరి లావణ్య శ్రీనివాస్‌గౌడ్‌తో కలిసి 7లక్షల వ్యయంతో డ్రైనేజీ ఫైప్‌లైన్ పనులను ప్రారంభించారు.అనంతరం శాంతినగర్‌లో పర్యటించి ప్రజల సమస్యలు తెలుసుకున్నారు. గతంలో కాలనీలో చేపట్టిన అభివృద్ధి పనులు, ఇంకా పెండింగ్‌లో ఉన్న సమస్యలపై కాలనీవాసులతో చర్చించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శాంతినగర్‌లో పూర్తిస్థాయి మౌలిక సదుపాయాలు కల్పిస్తామని హామీ ఇచ్చారు.ఎన్నికల సమయంలోనే రాజకీయాలని, అనంతరం ప్రజలకు అందుబాటులో ఉంటూ అభివృద్ధి పనులు చేపట్టడం తనకు ముఖ్యమని పేర్కొన్నారు. అంబర్‌పేట నియోజకవర్గంలో రోడ్లు, డ్రైనేజీ, మంచినీటి ఫైప్‌లైన్లు, వర్షపు నీటి ఫైప్‌లైన్లు, కమ్యూనిటీహాళ్లు, పార్కులు, స్మశానవాటికలను అభివృద్ధి చేపట్టినట్లు చెప్పారు. అలాగే అభివృద్ధితో పాటు సంక్షేమ పథకాలను ప్రజలకు అందుబాటులోకి తెస్తున్నట్లు పేర్కొన్నారు. బస్తీలు, కాలనీల్లో ఎక్కడ సమస్యలు నెలకొన్న నేరుగా తనను సంప్రదించి సమస్యల పరిష్కారానికి సహకారం అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో అధికారులు, బిఆర్ఎస్ నేతలు పాల్గొన్నారు.

## అల్లాపూర్ డివిజన్‌లో కమిషనర్ అమ్రపాలి పర్యటన


సబ్దార్‌నగర్‌లో వర్షానికి ఇళ్ళల్లోకి నీరుచేరడంతో ఆ ప్రాంతాన్ని పరిశీలిస్తున్న జిహెచ్‌ఎమ్‌సి కమీషనర్ ఆమ్రపాలి.

**యూసుఫ్‌గూడ, సెప్టెంబర్ 3, ప్రభాతవార్త :**

గత మూడురోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు అల్లాపూర్ డివిజన్ పరిధిలోని సబ్దార్‌నగర్ రాజీవ్‌గాంధీనగర్ బస్తీలలో వర్షపు నీరు ఇళ్ళల్లో చేరడంతో స్థానిక కార్పోరేటర్ సబీహాగౌసుద్దీన్‌తో కలిసి జిహెచ్‌ఎమ్‌సి కమీషనర్ అమ్రపాలి పర్యటించారు.ఈ సందర్భంగా పలు ఇళ్ళల్లో నీరు చేరడంతో అక్కడ నివసించే పేదలు ఇళ్ళల్లోని అన్ని రకాల వస్తువులు పాడైపోవడంతో ప్రజలంతా తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.ఆమె స్వయంగా ప్రజల కష్టాలను చూసి ప్రభుత్వం తరపున తమ వంతు సహాయ సహకారాలు అందిస్తాం వర్షపు నీరు ఇళ్ళవైపు రాకుండా నాలాలను పునరుద్దరిస్తామని ఎవ్వరు కూడా ఎలాంటి భయాందోళనలు చెందదొద్దని అభయమిచ్చారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గం మైనార్టీసెల్ అధ్యక్షులు ఎమ్‌డి గౌసుద్దీన్, జోనల్ కమీషనర్ అపూర్వ చౌహాన్,డిసి రమేష్, ఎస్‌యి చెన్నారెడ్డి, డియి.ఆనంద్,ఏయి రంజిత్, సబ్దార్‌నగర్ బస్తీ అధ్యక్షులు అబ్దుల్ హమీద్, సలీం, రఫీక్, తదితరులు పాల్గొన్నారు.

## మట్టి గణపతి పై అవగాహన కార్యక్రమం..

**పంజగుట్ట, సెప్టెంబర్ 3 (ప్రభాతవార్త):**

తెలంగాణ కాలుష్య నియంత్రణ మండలి, ఖైరతాబాద్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల వృక్ష శాస్త్ర విభాగం సంయుక్త ఆధ్వర్యంలో మట్టి గణపతి..మహా గణపతిపై అవగా హనా కార్యక్రమాన్ని నిర్వహించారు.ఈ కార్యక్రమంలో కాలుష్య నియంత్రణ మండలి సీనియర్ ప్రాజెక్ట్ ఆఫీసర్ బి.నాగేశ్వరరావు మట్టి గణపతి యొక్క ప్రాముఖ్యతను వివరించారు.అనంతరం విద్యార్థులకు ఈ అంశంపై క్విజ్ ప్రోగ్రాం నిర్వహించారు.ఈ సందర్భంగా కాలేజ్ ప్రిన్సిపాల్ డాక్టర్ బి. రాజేంద్రకుమార్ మాట్లాడుతూ వినాయక చవితి పండుగ సందర్భంగా చెరువు మట్టితోనే గణపతిని చేయాలని మట్టి గణపతి మహాగణపతి అని మట్టి గణప తిని వినియోగించి పర్యావరణ పరిరక్షణలో విద్యార్థులు తమవంతు కర్తవ్యాన్ని నిర్వహించాలని సూచించారు. బోటనీ హెడ్ డాక్టర్ శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ అడవులు, గాలి, నీరు,నేల,చెరువులు జీవవైవిధ్యం పర్యావరణ పరిరక్షణతో భవిష్యత్ తరాలకు వాతావరణ మార్పుల నివారణకు సహకరిస్తారని కోరారు. ప్రత్యామ్నాయంగా జూట్ బ్యాగ్‌లు,క్లాత్ బ్యాగులు వంటివి వినియోగించాలని సూచించారు. ఇదే కార్యక్రమంలో మట్టి గణపతిని పూజించాలనే తెలిపే గోడ పత్రికను ఆవిష్కరించారు.

## వరద బాధితులకు అండగా పెన్షనర్ల జెసి ఒకరోజు మూల వేతనం


సమావేశంలో మాట్లాడుతున్న ఛైర్మన్ లక్ష్మయ్య

**హైదరాబాద్, సెప్టెంబర్ 3, ప్రభాతవార్త:** ఇటీవల తెలంగాణ రాష్ట్రంలో సంభవించిన వరదల వల్ల నష్టపోయిన పేద ప్రజల సహాయార్థం రాష్ట్రంలోని పెన్షనర్లు ఒక రోజు మూల వేతనం విరాళంగా ఇచ్చేందుకు తెలంగాణ పెన్షనర్ల జేఏసీ ఏకగ్రీవంగా నిర్ణయం తీసుకుందని జేఏసీ ఛైర్మన్ కే.లక్ష్మయ్య, సెక్రటరీ జనరల్ శుభాకరరావు తెలిపారు. మంగళవారం తెలంగాణ పెన్షనర్స్ జేఏసీ కోర్ కమిటటీ సమావేశం ఛైర్మన్ అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్రంలో ఉన్న 2,86,000 మంది పెన్షనర్లు ఒకరోజు మూల వేతనం దాదాపు 33 కోట్ల రూపాయల వరకు ఉంటుందని, ఈ నిర్ణయాన్ని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శికి తెలియచేస్తూ సెప్టెంబర్ నెల పెన్షన్ నుండి మినహాయించుకోవలసిందిగా కోరినట్లు వివరించారు. ఈ సమావేశంలో కో ఛైర్మన్‌లు కృష్ణమూర్తి, భరత్‌రెడ్డి, సూర్యనారాయణ, వైస్ ఛైర్మన్ జ్ఞానేశ్వర్, తులసి సత్యనారాయణ, నరసింహారెడ్డి, మానయ్య, వీరస్వామి, వెంకట్‌రెడ్డి, ప్రసాదరావు, కృష్ణప్రసాద్ తదితర సభ్యులు పాల్గొన్నారు.

### పేదలకు అన్ని విధాలుగా ఆర్థిక సహాయం అందించాలి

**యూసుఫ్‌గూడ, సెప్టెంబర్ 3, ప్రభాతవార్త :**

ఎడతెరపు లేకుండా కురిసిన భారీ వర్షాలకు ఎంతో మంది పేదలు నిరాశ్రులయ్యారని అలాంటి వారిని అన్ని విధాల ఆదుకునేందుకు తగిన విధంగా ప్రభుత్వం నుంచి ఆర్థిక సహాయం అందించాలంటూ అల్లాపూర్ కార్పోరేటర్ సబీహగౌసుద్దీన్, జోనల్ కమీషనర్ అపూర్వచౌహాన్‌ను కలిసి వినతీ పత్రం అందజేశారు.

## మహిళలపై జరుగుతున్న దాడులను ఖండిస్తున్నాం

-జమాతే ఇస్లామీ హింద్ మహిళా విభాగం



నైతికతే నిజమైన స్వేచ్ఛ పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ప్రతినిధులు

**హైదరాబాద్, సెప్టెంబరు 3,ప్రభాతవార్త:**

దేశంలో మహిళలపై జరుగుతున్న లైంగడిక దాడుల, హత్యలపై జమాఅతే ఇస్లామీ హింద్ మహిళా విభాగం ఆందోళన వ్యక్తం చేసింది. ఈమేరకు మంగళవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సంస్థ ప్రచార కన్వీనర్ డాక్టర్ అస్రా ముహ్సినా మాట్లాడుతూ కోల్‌కతాలోని ఆర్జ్‌కార్ ఆసుపత్రిలో మహిళా డాక్టర్‌పై హత్యాచారం చేసి హత్యచేసిన ఘటనను గుర్తుచేస్తూ తీవ్రంగా ఖండించారు. దేశంలోని చాలా ప్రాంతాల్లో మహిళలంటే కనీస గౌరవం లేకుండా చూస్తున్నారని చిన్నారులను సైతం అత్యాచారాలకు గురిచేస్తున్నారని ఆందోళన వ్యక్తంచేశారు. పాఠశాల దశలోనే ఇలాంటి వాటిపై అవగాహన కల్పిస్తే కొంతమేరనైనా అడ్డుకట్టవేయొచ్చని అన్నారు. అందుకు బాలికలు, మహిళల్లో చైతన్యం తీసుకువచ్చేందుకు జమాఇతే ఇస్లామీ హింద్ మహిళా విభాగం తెలంగాణ శాఖ ఆధ్వర్యంలో "నైతికతే నిజమైన స్వేచ్ఛ " అనే అంశంపై సెప్టెంబర్ నెలమొత్తం స్కూళ్లు, కాలేజీలల్లో మహిళలకు అవగాహన కార్యక్రమం చేపడుతున్నట్లు ఆమె పేర్కొన్నారు. ఈసమావేశంలో సంస్థ మహిళా విభాగం రాష్ట్ర కార్యదర్శి ఖతీజా మెహ్వీన్, కార్యదర్శి సాజిదా బేగం, ఆర్గనైజింగ్ సెక్రటరీ ఇష్రత్ భాను తదితరులు పాల్గొన్నారు.

## గండిపేట చెరువులో చెత్తను తీయించిన డిజిఎం నరహరి

**నార్సింగి, సెప్టెంబర్ 3 ప్రభాతవార్త :**

గండిపేట జలాశయంలోకి పెద్ద ఎత్తు న వచ్చిన చెత్తను జల మండలి కార్మికులతో డిజిఎం నరహరి దగ్గరుండి తీయించి వేశారు. ఐదారు టిప్పర్లలో పట్టేంత చెత్త చెరువు కట్ట వద్దకు వచ్చి చేరింది. రెండు మూడు రోజులైనా సరే కార్మికులను ఇక్కడ పని చేయించి, నీటిలో ఉన్న చెత్తనంతా బయటకు తీసి వేస్తామని డిజిఎం నరహరి తెలిపారు. ప్రస్తుతం హైదరాబాద్ ప్రజలకు గండిపేట్ నీటిని తాగేందుకు సరఫరా చేస్తున్నామని, ప్రజలకు మంచినీటిని సరఫరా చేయించేందుకే చెత్తను తొలగిస్తున్నామని వివరించారు. మంత్రి పొన్నం ప్రభాకర్ గండిపేటకు వచ్చి నీటిని పరిశీలిస్తారని ప్రజా ప్రతినిధులంతా పెద్ద సంఖ్యలో ఈ జలాశయం వద్దకు వచ్చారు. కానీ హిమాయత్ సాగర్ వద్దకు వచ్చి అటే మంత్రి వెళ్లారు. దీంతో నార్సింగి మున్సిపల్ ఛైర్ పర్సన్ మైలారం నాగపూర్ణ శ్రీనివాస్, కౌన్సిలర్లు జి.శివారెడ్డి, దుర్గేష్ యాదవ్, మాజీ సర్పంచ్ గోపాల గణేష్, ప్రేమ్ కుమార్ తదితరులు గండిపేట చెరువులో టెంకాయలు కొట్టి, పూలు, పసుకు, కుంకుమ, అగర్‌బత్తులు పెట్టి త్వరగా నిండాలని గంగమ్మను కోరారు. ఈ సందర్భంగా నాగపూర్ణ మాట్లాడుతూ, గండిపేట చెరువు నిండితే రాజధాని ప్రజల దాహార్తి తీరుతుందని, అలాగే గండిపేట మండలంలోని అన్ని గ్రామాలలో ఉన్న ఇళ్లబోర్లలో నీరు వస్తుందన్నారు. చెరువు ఎండిపోతే ఇళ్లలోని బోర్లు సైతం ఎండిపోతాయని తెలిపారు. నీటి ఎద్దడి రాకుండా ఉండాలంటే గండిపేట నిండాలని కోరుకొని ప్రత్యేక పూజలు చేసినట్లు వివరించారు.


గండిపేట చెరువులో చెత్తను తీయిస్తున్న డిజిఎం నరహరి, నార్సింగి మున్సిపల్ ఛైర్ పర్సన్ నాగపూర్ణ శ్రీనివాస్‌లు.

## వైభవంగా తెలుగు వ్యవహారభాషా దినోత్సవం

**రవీంద్రభారతి, సెప్టెంబరు 3 ప్రభాతవార్త :** తెలంగాణ ప్రభుత్వ భాషా సాంస్కృతికశాఖ, ఫిలిమ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్, తెలంగాణ సహకారంతో శ్రీకళానికేతన్, హైదరాబాద్ 60 వసంతాల వజ్రోత్సవాన్ని పురస్కరించుకొని ఈరోజు, రేపు రెండురోజులపాటు జరుగుతున్న వజ్రోత్సవాలో భాగంగా డా. రేవూరు అనంతపద్మనాభరావు సభాధ్యక్షతన జరిగిన కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన తెలంగాణ ప్రభుత్వ పూర్వ సలహాదారు డా. కె.వి.రమణాచారి విశిష్ట అతిథులు డా. కోయి కోటేశ్వరరావు, దైవజ్ఞశర్మ తదితరులతో కలిసి ప్రముఖ కవయిత్రి, కథయిత్రి, వ్యాసకర్త, కాలమిస్టు, పరిశోధకురాలు జూపాక సుభద్రను ఘనంగా సత్కరించి కొసనం సుధాకర్-శ్రీకళానికేతన్ సాహిత్య పురస్కారం 2024 ప్రదానంచేసి శుభాభినందనలు తెలిపారు. ఈ వజ్రోత్సవాల్లో భాగంగానే నేటి సమాజంలో ఆడపిల్లలమీద అడుగడుగునా రకరకాల ఆంక్షలు విధింపబడుతూ జననంతో మొదలుకొని పెంపకం, చదువులు, సమాజవర్తన, పెళ్లి, ఉద్యోగం, స్వేచ్ఛ, దృష్టి, దృక్పథం, లింగ అసమానతలు, దుర్విచక్షణ, హక్కుల హననం, సాటి మనిషిగా గుర్తించపోవడం ఇలా అన్నిటా చూపిస్తున్న చిన్నచూపు తదితర దారుణ వివక్షకు వ్యతిరేకంగా ఒక వివాహిత మహిళ శంఖారావం చేసి తన హక్కును నిరూపించుకుని మరీ సాధించిన ఒక అపూర్వ ఘటనే ప్రధాన కథాంశమే మూల్యం నాటిక. సింహప్రసాద్ రచన; డా. వెంకట్ గోవాడ దర్శకత్వంలో గోడావ క్రియేషన్స్ హైదరాబాద్ వారి మూల్యం నాటిక ఆహుతులను ఎంతగానో అలరించి ఆకట్టుకుంది.


జూపాక సుభద్రకు సాహిత్య పురస్కారం ప్రదానం చేస్తున్న రమణాచారి, పద్మనాభరావు, దైవజ్ఞశర్మ, కోటేశ్వరరావు తదితర అతిథులు

## దేశ సేవలో సిఆర్‌పిఎఫ్ సేవలు అమోఘం

**చార్మినార్,సెప్టెంబరు 3 ప్రభాతవార్త :**

దేశ రక్షణ సేవలో సిఆర్‌పిఎఫ్ దళం సేవలు అమోఘమని రెండు సిగ్నల్ కమాండెంట్ ఓం హరి అన్నారు.సిఆర్‌పిఎఫ్ రెండు సిగ్నల్ 56వ వ్యవస్థాపక దినోత్సవం సందర్భంగా మంగళవారం హైదరాబాద్ పాతబస్తీ చాంద్రాయణగుట్ట సెగ్మెట్ బార్కాస్ సిఆర్‌పిఎఫ్ గ్రూప్ సెంటర్ ఆవరణలో ఏర్పాటు చేసిన రక్త దాన కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా విచ్చేవారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర పారా మిలటరీ దళాలలో సెంట్రల్ రిజర్వ్ పోలీస్ ఫోర్సుకు ప్రత్యేక స్థాన ముందని,దేశ సరిహద్దు పరిరక్షణ,సమాచార వ్యవస్థను చేరవేయటంలో సిగ్నల్ విభాగం కీలకంగా వ్యవహరిస్తోందని ఆయన తెలియజేశారు.భారత దేశంలో ప్రతీ సంవత్సరం నాలుగు కోట్ల యూనిట్ల రక్తం అవసరం ఉండగా కేవలం నాలుగు లక్షల యూనిట్ల రక్తం మాత్రమే లభ్యమవుతున్నదని ఆయన తెలిపారు. ప్రతీ రెండున్నర సెకన్లకు ఒకరికి రక్తం అవసరమని ప్రపంచ ఆరోగ్య సంస్థ నివేదిక తెలుపుతున్నదని ఆయన తెలియజేశారు.ఈ రక్తదాన కార్యక్రమంలో సిఆర్‌పిఎఫ్ అధికారి రెండు వైసీ ఉత్తమ్ బెనర్జీ,రెడ్ క్రాస్ సంస్థ వైద్యులు వెంకట్ రెడ్డి,పరమేశ్వర్,జనార్దన్ రెడ్డితో పాటు పలువురు పాల్గొన్నారు.దాదాపు యాభై ఆరు మంది జవానుల రక్త దానం చేశారు.


సిఆర్‌పిఎఫ్ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం

### మంకీపాక్స్‌తో జాగ్రత్తగా ఉండాలి : డాక్టర్ మల్లాదేవి వినయ

**పంజగుట్ట, సెప్టెంబర్ 3 (ప్రభాతవార్త):**

మంకీపాక్స్‌తో జాగ్రత్తగా ఉండాలని అపోలో క్రెడిల్ చిల్డ్రన్స్ ఫిజీషియన్ డాక్టర్ మల్లాదేవి వినయ సూచించారు. ప్రపంచ వ్యాప్తంగా మంకీపాక్స్ వ్యాప్తిని దృష్టిలో పెట్టుకుని ఒక ప్రకటన విడుదల చేశారు. మంకీపాక్స్‌ను ఇపుడు ఎంపాక్స్ అంటున్నారని పేర్కొన్నారు. ఇది ఎంపాక్స్ వైరస్ వల్ల కలిగే వైరల్ జూ నోటిక్ ఇన్‌ఫెక్షన్ అని తెలిపారు.ఇది మశూచి వల్లే దద్దురున్ల కలిగి ఉంటుందన్నారు.వ్యక్తి నుంచి వ్యక్తికి వ్యాప్తి చెందుతుందని తెలిపారు. మరణాలు తక్కువగా ఉన్నాయని, కానీ చిన్న పిల్లలు, గర్భిణీలు, రోగ నిరోధక శక్తి తక్కువగా ఉన్నవారిలో తీవ్రంగా ఉంటుందని పేర్కొన్నారు.జంతువు నుంచి మనిషికి..ఇది సోకిన జంతువుల శరీ ద్రవాలు ఇతరత్రా ద్వారా సోకుతుందని తెలిపారు. ఈ వైరస్ సోకిన వారికి లక్షణాలు కనిపించడానికి 5 నుంచి 13 రోజులు పడుతుందని తెలిపారు. కొంతమంది రోగులలో కంటి సమస్యలు, నరాల సంబంధిత లక్షణాలు కూడా కనిపిస్తాయని వివరించారు.మంకీపాక్స్ చికిత్సకు నొప్పి నివారణ మందులు మూత్రం సాఫీగాఉండేందుకు సహాయపడేమందులు ప్రాక్టిటిస్ కో సంటాపికల్ లిడోకైన్ సిట్జ్ బాత్‌లు వాడాలన్నారు. టెకోవిరిమాట్, సిడోఫోవిర్, బ్రిసి డోఫోవిర్ తదితర మందులు తీవ్రమైన కేసులలో వాడాలని తెలిపారు. ఈ వ్యాధి సోకిన వారిని తగిన జాగ్రత్తలు తీసుకుంటూ ఇతరులకు దూరంగా ఉంచేలా చూడాలన్నారు.

## మట్టి విగ్రహాలనే పూజించండి: డాక్టర్ విజయరంగ




**ఎల్బీనగర్, సెప్టెంబర్ 3 (ప్రభాతవార్త) :**

మట్టి విగ్రహాలనే పూజించి పర్యావరణ పరిరక్షణకు సహకరించాలని లయన్స్ క్లబ్ జిల్లా హెల్త్ క్యాంప్ చైర్మన్ డాక్టర్ బి.విజయరంగ విజ్ఞప్తి చేశారు. పర్యావరణ సంరక్షణలో భాగంగా ప్లాస్టర్ ఆఫ్ పారిస్, కెమికల్ కలసిన పెయింట్ లతో తయారైన విగ్రహాల వల్ల చెరువులు కలుషితం అవ్వకుండా పెద్దఎత్తున మట్టి వినాయకుల పంపిణీ కార్యక్రమం అవగాహన కార్యక్రమంలో భాగంగా మేయర్ గద్వాల్ విజయలక్ష్మి, డిప్యూటీ మేయర్ లతశోభన్ రెడ్డితో కలిసి పోస్టర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మట్టి వినాయకులను ఉపయోగించాలని, కాలుష్య రహిత నగరంగా తీర్చిదిద్దడంలో ప్రజలు భాగస్వాములు కావాలని కోరారు. ఈ కార్యక్రమంలో కొత్తపేట లైన్స్ క్లబ్ అధ్యక్షుడు కర్ణ శ్రీనివాసరావు, క్లౌడ్ మీడియా చైర్మన్ బ్రహ్మశ్రీ రామకృష్ణాచార్యులు పాల్గొన్నారు.

## డివిజన్ సమస్యలు పరిష్కరించాలని కార్పొరేటర్ వినతి



**ఎల్బీనగర్, సెప్టెంబర్ 3 (ప్రభాతవార్త) :**

డివిజన్‌లో పేరుకుపోయిన సమస్యలను వెంటనే పరిష్కరించే విధంగా చర్యలు తీసుకోవాలని కొత్తపేట డివిజన్ కార్పొరేటర్ నాయకోటి పవన్ కుమార్ విజ్ఞప్తి చేశారు. జలమండలి జీఎం బలరాంను మంగళవారం కార్పొరేటర్ కలిసి డివిజన్ లో ఉన్నటువంటి సమస్యలపై వినతి పత్రాన్ని అందజేశారు. కొత్తపేట డివిజన్ లో త్రాగునీటి సమస్యలు ఉన్నాయని రాజీవ్ గాంధీ నగర్ ఫేస్1 లో నూతన త్రాగు నీటి లైన్ ఎర్పాటు చేయించాలని కోరారు. కొత్తపేట డివిజన్ పరిధిలో వివిధ కాలనీలో ప్రజల అవసరాల మేరకు త్రాగునీటి లైన్ పొడిగించాలని కోరారు. వినాయక చవితి వస్తుండటంతో కొత్తపేట డివిజన్ పరిధిలో నూతన డ్రైనేజ్ లైన్ పనులు చేసి రోడ్డు ప్యాచ్ వర్క్ చేయకపోవడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. వెంటనే రోడ్డు మరమత్తులు చేయించాలని కోరారు. డ్రైనేజ్ మ్యాన్ హెూల్స్ కూలిపోతున్నాయని ఎటువంటి ప్రమాదాలు జరగకముందే వాటిని గుర్తించి మరమత్తులు చేయించాలని కోరారు.

## చంచల్ గూడా మర్కాజి అంజుమన్ ఇ మెహదవియ కమిటీ అధ్యక్షుడిగా మునావర్ ఖాన్



**మలక్‌పేట్,సెప్టెంబర్ 3 (ప్రభాతవార్త) :**

చంచల్ గూడా మర్కాజి అంజుమన్ ఇ మెహదవియా కమిటీ అధ్యక్షుడిగా ప్రముఖ నాయకుడు మునావర్ ఖాన్ ఎన్నికయ్యారు. చంచల్ గూడా లోని మర్కాజి అంజుమన్ ఇ మెహదవియా కమిటీకి ఎన్నికలు నిర్వహించగా మునావర్ ఖాన్ కు 387 ఓట్లు రాగా సమీప ప్రత్యర్థి ఆదిల్ మహమ్మద్ ఖాన్ కు 118 ఓట్లు వచ్చాయి, తన సమీప ప్రత్యర్థి ఆదిల్ మహమ్మద్ ఖాన్ పై 259 ఓట్ల మెజారిటీతో మునావర్ ఖాన్ విజయం సాధించి కమిటీ అధ్యక్షుడిగా ఎన్నికయ్యారు. అధ్యక్షుడిగా విజయం సాధించిన మునావర్ ఖాన్ మాట్లాడుతూ అంజుమన్ ఇ మెహదవియ కమిటీ అభివృద్ధికి కృషి చేస్తామన్నారు. అధ్యక్షుడిగా గెలిపించిన సభ్యులందరికీ ఆయన కృతజ్ఞతలు తెలియజేశారు.

## గణేష్ నిమజ్జనానికి అన్ని ఏర్పాట్లు చేయాలి

**బొక్క మధుసూదన్ రెడ్డి**



**మలక్‌పేట, సెప్టెంబర్ 3 (ప్రభాతవార్త) :**

గణేష్ నిమజ్జనానికి అన్ని ఏర్పాట్లు చేయాలని గణేష్ ఉత్సవ సమితి ప్రతినిధుల బృందం సౌత్ జోన్ జోనల్ కమిషనర్ వెంకన్నకు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా గణేష్ ఉత్సవ సమితి సభ్యులు బొక్క మధుసూదన్ రెడ్డి, కౌడి మహేందర్, కొత్త కాపు రవీందర్, రెడ్డి మధుకర్ రెడ్డి తదితరులు మాట్లాడుతూ గణేష్ నిమజ్జనానికి అవసరమైనటువంటి వీధి దీపాలు, మెయిన్ రోడ్లపై ప్యాచ్ వర్కులు, చెట్ల కొమ్మల ట్రిమ్మింగ్ మండపాల వద్ద చెత్త, వ్యర్ధాలను తొలగించాలని కోరారు. నిమజ్జనం చేసే చెరువులలో గుర్రపు డెక్కలను తీయించాలని పేర్కొన్నారు. జోనల్ కమిషనర్ వెంకన్న మాట్లాడుతూ అధికారులకు అన్ని ఆదేశాలు జారీ చేశామని చెట్ల కొమ్మల ట్రిమ్మింగ్, నిమజ్జనం కోసం తాత్కాలిక పాండ్స్, క్రేన్ల కోసం టెండర్ల పనులు పూర్తి అయ్యాయని త్వరలో అన్ని పనులు ప్రారంభిస్తామని తెలిపారు. సమస్యలు పరిష్కారం కాకపోతే తమ దృష్టికి తీసుకురావాలని వెంటనే వాటిని పరిష్కరిస్తామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సుభాష్ చంద్ర జీ, సహదేవ్ యాదవ్, నిరంజన్ యాదవ్, ఉదయ్, బాల్ రెడ్డి, శ్రీకాంత్ రెడ్డి, వినోద్, ముఖేష్, ఈశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

# మట్టి వినాయక విగ్రహాలను పూజించండి : ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి

**ఉప్పల్, సెప్టెంబర్ 3 (ప్రభాతవార్త) :**

పర్యావరణ పరిరక్షణ కోసం ప్రతి ఒక్కరూ మట్టి వినాయక విగ్రహాలని పూజించాలని ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి పేర్కొన్నారు. ఈ మేరకు ఉప్పల్ గణేష్ ఉత్సవ సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు ఆకుల మహేందర్, అధ్యక్షుడు జట్టా కిషోర్ ఆధ్వర్యంలో ఎమ్మెల్యే లక్ష్మారెడ్డికి మట్టి వినాయక విగ్రహాలను అందజేశారు. అనంతరం జరిగిన కార్యక్రమంలో ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి మాట్లాడుతూ ఉప్పల్ గణేష్ ఉత్సవ సమితి ఆధ్వర్యంలో ప్రతిఏటా మట్టి వినాయక విగ్రహాల పంపిణీ చేయడం అభినందనీయమన్నారు. వినాయక చవితి ఉత్సవాలకు ప్రభుత్వం నుంచి అన్ని ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. వినాయక చవితి సందర్భంగా వివిధ ప్రాంతాలను మండపాల వద్ద తగు జాగ్రత్తలు తీసుకోవాలని సూచన సూచించారు అనంతరం



ఎల్బీనగర్ జోనల్ కమిషనర్ హేమంత్ కేశవ్ పాటిల్ కు కూడా మట్టి వినాయక విగ్రహాలను ఈ కార్యక్రమంలో ఉప్పల్ గణేష్ ఉత్సవ సమితి అధ్యక్షులు జెట్ట కిషోర్ , మాజీ అధ్యక్షులు నిరంజన్ చారి, కుదుముల ప్రదీప్ రెడ్డి, ఏమండ్ల రామ్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## జాతీయ విపత్తుగా ప్రకటించి ఆర్థిక సహాయం చేయాలి : సీపీఐ

*హయత్‌నగర్, సెప్టెంబర్ 3 (ప్రభాతవార్త) :*

*రాష్ట్ర వ్యాప్తంగా భారీ వర్షాల కారణంగా అనేక గ్రామాలు నీట మునిగాయని, చెరువులకు గండ్లు పడి వరదలతో రాష్ట్రం అతలాకుతలం అయ్యిందని కేంద్రం జాతీయ విపత్తుగా ప్రకటించి వేంటనే ఆర్థిక సహాయం అందించాలని సీపీఐ రాష్ట్ర కార్య వర్గ సభ్యుడు ఆందోజు రవీ%శీ%ద్రాచారి కేంద్రాన్ని డిమాండ్ చేశారు. హయత్ నగర్ మండల పార్టీ కార్యాలయంలో నియోజక వర్గ కార్యదర్శి సామిడి శేఖర్ రెడ్డితో కలిసి మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ... రాష్ట్రంలో ఎడతెరిపి లేకుండా కురిసిన వర్షాలతో రవాణా వ్యవస్థ అస్తవ్యస్తంగా మారిందని, పంట పొలాలలో ఇసుక మేటలు పేరుకుపోయి రైతులు తీవ్రంగా నష్టపోయారని తెలిపారు. ఇప్పటికీ అనేక గ్రామలు జలదిగ్భంధంలోనే ఉన్నాయని అక్కడి ప్రజాలకు తాగునీరు, ఆహారం అందించాలన్నారు. అపరిశుభ్రత కారణంగా అంటు వ్యాదులు ప్రభలే ప్రమాదం ఉందని... మెడికల్ ఎమర్జెన్సీ ప్రకటిచాలరని, బాధితులను పునారావాస కేంద్రాల్లో ఉంచి అందుకోవాలన్నారు. నగరంలో లోతట్టు ప్రాంతాలు చెరువులను తలపిస్తున్నాయని ప్రజలు తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొంటున్నారని వరదల్లో నష్టపోయిన వారిని ప్రభుత్వం అందుకోవాలన్నారు. మరిణించిన కుటుంబాలకు పది లక్షల ఏక్స్ గ్రేషియాన్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. ప్రజలు కుడా అప్రమత్తంగా ఉండాలని అవసరమయితే తప్పా ఇళ్ల నుండి బయటికి రావద్దని కోరారు.*



## స్తంభాన్ని తొలగించి ప్రమాదాలను నివారించండి



**హయత్‌నగర్, సెప్టెంబర్ 3 (ప్రభాతవార్త) :**

జాతీయ రహదారి సర్వీస్ రోడ్డులో పెద్ద అంబర్ పేట జేసీబీ జంక్షన్ సమీపంలో కొత్తగా ప్రారంభించిన ప్రైవేటు ఆసుపత్రి ముందున్న హైటెన్షన్ విద్యుత్ స్థంభం ప్రమాద కరంగా మారింది. జాతీయ రహదారి నుండి పెద్ద అంబర్ పేట గ్రామంలో కి వెళ్లే దారికి సమీపంలో ఉన్న హైటెన్షన్ విద్యుత్ స్తంభం రోడ్డుపైనే ఉండడంతో ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనన్న ఆందోళన నెలకొంది. పక్కనే దానికి ప్రత్యామ్నాయంగా వేరే స్తంభాలు ఏర్పాటు చేసినా... విద్యుత్ తీగలు మార్చలేదు. అసలే అక్కడ తరుచూ ట్రాఫిక్ సమస్య తలెత్తు తుంది. అధికారులు వెంటనే స్పందించి రోడ్డుకు అత్యంత సమీపంలో ఉన్న హైటెన్షన్ విద్యుత్ స్తంభాన్ని తొలగించి ప్రమాదాలు జరగకుండా చర్యలు తీసుకోవాలని వాహన దారులు కోరుతున్నారు.

## వరద బాధితులకు సాయం అందిస్తాం

**కార్పొరేటర్ ప్రేమ్ కుమార్**

**మల్కాజిగిరి, సెప్టెంబర్ 3 (ప్రభాతవార్త) :**



భారీ వర్షాలకు నష్టపోయిన బాధితులకు ప్రభుత్వం నుంచి సహాయం అందిస్తామని ఈస్ట్ ఆనంద్ బాగ్ డివిజన్ కార్పొరేటర్ ప్రేమ్ కుమార్ అన్నారు. మంగళవారం ఈస్ట్ ఆనంద్ బాగ్ డివిజన్ పరిధిలోని బిజెఆర్ నగర్‌లో ఇటీవల కూర్చున్న వర్షానికి ఇంటి ప్రహరీ గోడ కూలిపోవడం జరిగింది. అందులో నివాసం ఉంటున్న వృద్ధులు పోచయ్య సిద్ధమ్మ వారి కూతురు ఇంటికి తీసుకెళ్లడం జరిగింది. విషయం తెలుసుకున్న కార్పొరేటర్ వై ప్రేమ్ కుమార్ జిహెచ్ఎంసి రెవెన్యూ అధికారులతో కలిసి పరిశీలించి బాధితులకు నష్టపరియాలు అందేలా చూస్తానని హామీ ఇవ్వడం జరిగింది. వరద బాధితులకు ప్రభుత్వం నుంచి సహాయం అందిస్తామన్నారు ఈ కార్యక్రమంలో రెవెన్యూ ఇన్స్పెక్టర్ పరమేశ్వర్ రెడ్డి డి లౌక్య బాబు తిరుపతి కిషోర్ వెంకట నరసయ్య తదితరులు పాల్గొన్నారు.

## గణేష్ ఉత్సవాలను ప్రశాంతంగా జరుపుకోవాలి

**డీసీపీ పాటిల్ కాంతిలాల్ సుభాష్**

**సైదాబాద్, సెప్టెంబరు 3 (ప్రభాత వార్త) :**

వినాయక చవితి ఉత్సవాలను ప్రశాంతమైన వాతావరణంలో జరుపుకోవాలని సౌత్ ఈస్ట్ జోన్ డిసిపి కాంతిలాల్ సుభాష్ అన్నారు. వినాయక చవితి పండుగను పురస్కరించుకొని సౌత్ ఈస్ట్ జోన్ పరిధిలోని భాగ్యనగర్ గణేష్ ఉత్సవ సమితి నిర్వాహకులు మరియు వివిధ ప్రభుత్వ శాఖల అధికారులతో మంగళవారం సైదాబాద్ పోలీస్ స్టేషన్‌లో ఆయన సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా డిసిపి మాట్లాడుతూ వినాయక చవితి ఉత్సవాల సమయంలో నిమజ్జన సమయంలో అన్ని ప్రభుత్వ శాఖల అధికారులు సమన్వయంతో పని చేయాలని సూచించారు. మండపాల నిర్వాహకులు, ప్రజలు పోలీసులతో సహకరించాలని కోరారు. మండపాల నిర్వాహకులు పోలీసుల సూచనలు పాటించాలన్నారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ డీసీపీ స్వామి, సైదాబాద్ ఏసీపీ వెంకన్న నాయక్, సైదాబాద్ ఇన్ స్పెక్టర్ రాఘవేందర్ తదితరులు పాల్గొన్నారు.







జిహెచ్ఎంసి కమిషనర్ ఆమ్రపాలిని మంగళవారం నాగోల్ డివిజన్ కార్పొరేటర్ చింతల అరుణ సురేందర్ యాదవ్ కలిసి నాగోల్ డివిజన్ అభివృద్ధికి సహకరించాలని, సమస్యల పరిష్కారానికి నిధులు మంజూరు చేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో హయత్ నగర్ డివిజన్ కార్పొరేటర్ కళ్లెం నవ జీవన రెడ్డి, బియన్ రెడ్డి నగర్ కార్పొరేటర్ మొద్దు లచ్చిరెడ్డి పాల్గొన్నారు. - ఎల్బీనగర్, ప్రభాతవార్త

## ఓల్డ్ మల్లాపూర్ సీసీ రోడ్ల అభివృద్ధి కోసం వినతి

**నాచారం, సెప్టెంబర్ 3 (ప్రభాతవార్త) :**

ఓల్డ్ మల్లాపూర్ లో పలు బస్తీలల్లో సీసీ రోడ్లు అధ్వాన్న స్థాయిలో ఉన్నాయని, సీసీ రోడ్లు అభివృద్ధి పరిచేందుకు నిధులు మంజూరు చేయాలని కోరుతూ జీహెచ్ఎంసి ఈస్ట్ జోన్ కమిషనర్ హేమంత్ కేశవ్ పటిల్‌కు ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి, కార్పొరేటర్ పన్నాల దేవేందర్ రెడ్డి వినతిపత్రాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో కాప్రా సర్కిల్ డిప్యూటీ కమిషనర్ జగన్, ఈస్ట్ జోన్ సీనియర్ ఇంజినీర్ అశోక్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



## వికలాంగుల హెూమ్ హాస్టల్లో విద్యార్థులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోవాలి : చైర్మన్ ముత్తినేని వీరయ్య



**మలక్‌పేట, సెప్టెంబర్ 3 (ప్రభాతవార్త) :**

వికలాంగుల హెూమ్ హాస్టల్స్ లో ఉన్న విద్యార్థులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోవాలని వికలాంగుల సంక్షేమ శాఖ చైర్మన్ ముత్తినేని వీరయ్య సంబంధిత అధికారులకు ఆదేశించారు. భారీ వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో చైర్మన్ ముత్తినేని వీరయ్య వికలాంగుల హెూం హాస్టల్, హైదరాబాద్ జిల్లాకు చెందిన సరూర్ నగర్ అంధ బాలికల హాస్టల్, రంగారెడ్డి జిల్లాకు చెందిన చంపాపేట్ శారీరక హెూమ్ హాస్టల్ ను ఆయన సందర్శించి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అంధ బాలికల హాస్టల్లో నెలకొన్న సమస్యలను ఆయన అడిగి తెలుసుకున్నారు. స్థానిక ఏసీపీతో ఆయన ఫోన్లో మాట్లాడి హాస్టల్ పరిసర ప్రాంతంలో పోలీస్ పెట్రోలింగ్ ను రాత్రి వేళల్లో ఏర్పాటు చేయాలని కోరారు. హాస్టల్ లోని సమస్యలను తక్షణమే పరిష్కరించాలని హాస్టల్ ఇన్ ఛార్జ్ అరుణ, వార్డెన్ లకు ఆయన సూచించారు. చంపాపేట హాస్టల్ ను రంగారెడ్డి డిడబ్ల్యూ ఓ పద్మజ, హాస్టల్ ఇన్చార్జ్ అరుణ తదితరులతో సందర్శించి వారి సమస్యలను తెలుసుకున్నారు. వర్షం మూలంగా హాస్టల్ విద్యార్థులకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని ఆయన పేర్కొన్నారు.

## డ్రైనేజీ సమస్యలు తలెత్తకుండా చర్యలు

**కార్పొరేటర్ కొత్త కాపు అరుణ**



**సైదాబాద్, సెప్టెంబరు 4 (ప్రభాతవార్త) :**

సైదాబాద్ డివిజన్ పరిధిలో డ్రైనేజీ సమస్యలు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని కార్పొరేటర్ కొత్త కాపు అరుణ రవీందర్ రెడ్డి అధికారులకు సూచించారు. డివిజన్ పరిధిలోని రెవెన్యూ బోర్డు కాలని, ఏపీఏయు కాలనీలలో మంగళవారం వాటర్ వర్క్స్ అధికారులతో కలిసి పర్యటించి స్థానిక సమస్యలను పరిశీలించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ ప్రజల నుంచి వచ్చే ఫిర్యాదుల పట్ల అధికారులు అప్రమత్తంగా ఉండి ఎప్పటికప్పుడు సమస్యల పరిష్కారానికి తగిన చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జిఎం శ్యాంసుందర్, డీజీఎం నాగరాజు, మేనేజర్ శ్రవణ్, కాలనీవాసులు భాస్కర్ రెడ్డి, శ్యాంప్రసాద్, వెంకట్ రెడ్డి, సత్యనారాయణ, రాంచందర్, సతీష్ తదితరులు పాల్గొన్నారు.

## శ్రీ మాత అన్నపూర్ణేశ్వరి ట్రస్ట్ ఆధ్వర్యంలో అన్నదానం



**సైదాబాద్, సెప్టెంబరు 3 (ప్రభాతవార్త) :**

అన్ని దానాల్లోకెల్లా అన్నదానం గొప్పదని శ్రీమాతా అన్నపూర్ణేశ్వరి అన్న ప్రసాద వితరణ కమిటీ చైర్మన్ భగవాన్ అన్నారు. అమావాస్య సందర్భంగా శ్రీ మాతా అన్నపూర్ణేశ్వరి అన్న ప్రసాద వితరణ కమిటీ ఆధ్వర్యంలో చంపాపేటలోని శ్రీ నల్ల పోచమ్మ దేవాలయ ఆవరణలో అన్నదానం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా రిటైర్డ్ పోలీస్ అధికారి వెంకటేశ్వరరావు హాజరయ్యారు. ఈ సందర్భంగా భగవాన్ మాట్లాడుతూ గత 16 నెలలుగా ప్రతి అమావాస్య నాడు అన్నదానం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో రవి ముదిరాజ్, సుశీల్ కుమార్, సంతోష్, ప్రవీణ్, వెంకటేష్, చింటూ, రాజు తదితరులు పాల్గొన్నారు.

## గణేష్ ఉత్సవాలకు విస్తృత ఏర్పాట్లు

**కార్పొరేటర్ రజిత పరమేశ్వర్ రెడ్డి**



**ఉప్పల్, సెప్టెంబర్ 3 (ప్రభాతవార్త) :**

గణేష్ ఉత్సవాలకు భారీగా ఏర్పాట్లను చేయాలని ఉప్పల్ కార్పొరేటర్ మందుముల రజితపరమేశ్వర్ రెడ్డి అధికారులను ఆదేశించారు. ఈ మేరకు మంగళవారం ఉప్పల్ లోని నల్ల చెరువు సమీపంలోని గణేష్ నిమజ్జన కొలనును మున్సిపల్ అధికారులతో కలిసి ఆమె పరిశీలించారు. అనంతరం జరిగిన కార్యక్రమంలో రజిత పరమేశ్వర్ రెడ్డి మాట్లాడుతూ భక్తులకు ఉత్సవాల, నిమజ్జన సమయంలో ఎలాంటి ఇబ్బంది కలగకుండా ఉండేలా ఏర్పాట్లను చేయాలని పేర్కొన్నారు. వినాయక నిమజ్జనం పొలంలో వద్ద భక్తులకు ఇబ్బంది లేకుండా తగు ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు ఉత్సవాలు విజయవంతంగా నిర్వహించాలని సూచించారు.వినాయక విగ్రహాలు ప్రయాణించే రోడ్లకు తాత్కాలిక మరమ్మత్తులు చేయాలని, గుంతల రోడ్లు పూడ్చివేయాలని పేర్కొన్నారు ఈ కార్యక్రమంలో ఉప్పల్ నియోజకవర్గ ఇంచార్జ్ మందముల పరమేశ్వర్ రెడ్డి, డిప్యూటీ కమీషనర్ ఆంజనేయులు, ఈఈ నాగేందర్, డిఈ నిఖిల్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ నేతలు బాకారం లక్ష్మణ్, లింగంపల్లి రామకృష్ణ, తుమ్మల దేవిరెడ్డి, ఆగం రెడ్డి ,మార్తం ఉపేందర్ రెడ్డి, పాలడుగు లక్ష్మణ్, సుంకు శేఖర్‌రెడ్డి, షాగాశ్రీధర్, సందీప్, భాస్కర్, సతీష్‌గౌడ్, మంద మురళి కృష రెడ్డి, గొరిగ మహేష్, నాగూర్ బాషా, అమర్, సత్యం, జిల్లు, సాయి గౌడ్, తెల్కల రాజ్ రెడ్డి, తెల్కల సుధాకర్, పంగ దుర్గరెడ్డి, రవి పాల్గొన్నారు.